# అలవాటు

"మీ తమ్ముడు ఆడపిల్లలకి అలవాటు పడ్డాడు. ఈ వయస్సులో ఇదేం బుద్ధి? ఒకరా, ఇద్దరా, అంతమందా? కావాలంటే ఎవరో ఒకర్ని పెళ్ళిచేసుకోమను. అంతమందిని చెడగొడితే వాళ్ళ ఉసురు తగులుతుంది. ఆయన అసలే హృద్రోగి, ఈ వయసులో ఈ ఉద్వేగాల పనులెందుకు? ఉన్నార్లో ఉన్నారు. మీ తమ్ముణ్ణి మీరు పట్టించుకోకపోతే ఎట్లా? నాన్న ఏమవుతాడోనని నాకు ఆందోళనగా వుంది. మా నాన్నను మీరే కాపాడాలి. పెదనాన్న" అంది రత్న.

రత్న, కరుణాకరరెడ్డి పెద్ద కూతురు. ఏభయ్యేళ్ళు. నలుగురు పిల్లల తల్లి. భార్యాభర్తలకు ఉద్యోగాలు, బెంగళూరులో నివాసం. రత్నకు నలుగురు చెల్లెళ్ళు, అందరూ ఉద్యోగినులు, వాళ్ళ భర్తలు మంచి ఉద్యోగాలలో ఉన్నారు. ఉద్యోగాలవల్ల, భర్తలవల్ల వాళ్ళు ఊరొదిలిపెట్టారు. అయిదుగురికి పిల్లా పాపలతో కళకళలాడే సొంతఇళ్ళు, సుఖజీవితాలు, అన్నదమ్ములేరు.

కరుణాకరరెడ్డి మా చివరి తమ్ముడు, డెబ్బై ఏళ్ళు. సుఖ పురుషుడు, మంచి భార్య. ఇద్దరివీ మంచి ఉద్యోగాలు. భార్య పోయి పదేళ్ళయింది. లంకంత ఇంటిలో ఒక్కడే ఉంటున్నాడు. ఉండేది హైద్రాబాదులోనే ఐనా వాడామూల, నేనీమూల ఎప్పుడో తప్ప కలవం. ఎప్పుడయినా ఫోను మాటలు. రాకపోకలు, వయస్సుల వల్ల, క్రమక్రమంగా తగ్గుతున్నాయి.

వాడు మంచి భర్త, మంచి తండ్రి. ఆఫీసు అయిపోతే ఇంట్లో వాలేవాడు. భార్య కొంగు పట్టుకొని ఉండేవాడు. నిరంతర నిర్విరామ సతాయింపు తట్టుకోలేక సుగుణ 'షికారుకు పోకూడదా, బజారుకు పోకూడదా, సినిమా చూసి రాకూడదా' అని అంటే 'ఇద్దరం కలిసేపోదాం' అనేవాడు. 'ఇక్కడే కాక ఇక అక్కడ కూడానా' అని ఆమె మానేసేది. భర్తను పూలల్లో పెట్టి పూజించింది. ఉత్తమ ఇల్లాలు. నా మరదళ్ళలో ఆమె నాకు చాలా ఇష్టం. ఎప్పుడూ ముఖంలోకి చూసేది కాదు. ఎప్పుడొచ్చినా కాళ్ళకు నమస్కరించేది. తల్లీ పిల్లలు తమ్ముణ్ణి మహారాజును చేసి గృహ సామ్రాజ్యాన్ని పరిపాలించనిచ్చారు.

నాకు తెలిసినంతవరకు వాడు ఏకపత్నీవ్రతుడు. అన్యస్త్రీల ముఖాలు చూసిన దాఖలాలు లేవు. అట్లాంటి వాడు పాడయ్యాడంటే బాధగానే ఉంది. తమ్ముడికి రెండే

చెడ్డ అలవాట్లుండేవి. ఒకటి సిగరెట్టు, రెండుపుస్తకాలు. పుస్తకాలు ఎక్కడంటే అక్కడ పెడతాడు. సిగరెట్లు పీకల నుసి వాడి ఇష్టం. భార్య పుస్తకాలు సర్దుతూ, సిగరెట్లు కంపు ఊడ్చిపారేస్తుంటే పిల్లలు సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె అందించేవాళ్ళు.

కరుణ సిగరెట్టు సుతారంగా తాగేవాడు. షోగ్గా పట్టుకొనేవాడు. పొగరింగులు వదిలేవాడు. వాటిని చూడటం వాడి కూతుళ్ళకు ఇష్టం. కరుణ సిగరెట్లు మానవలసి రావటం దురదృష్టమే! భార్య బ్రతికి ఉండగా ఒకసారి, చనిపోయాక మరోసారి గుండె ఆపరేషన్ చేసిన డాక్టరు 'ఇంకోసారి ఆపరేషన్ చేయలేం, సిగరెట్లు తాగుతూ ఉంటే మా వల్ల కాదు. సిగరెట్లు మానాలి. వాకింగ్‌చేయాలి'. చందశాసనం ముఖంమీద కొట్టాడు.

బతికి ఉన్నంతకాలం సేవచేసిన సుగుణ చనిపోయి కూడా సేవచేస్తూనే వుంది. ఆమె లేకపోవడం వల్ల ఆమె కొంగు పట్టుకొని తిరిగే పనిలేక ఇల్లొదిలి వాకింగు పేరిట వీధుల్లో తిరగడం ఆరంభించాడు. మానుల మధ్య కంటే మనుష్యుల మధ్య తిరగడం ఇష్టం.

పని లేకుండా నడవాంటే కోపం వచ్చేది. అంత దూరం పోయి పాల ప్యాకెట్ తెస్తాడు, మళ్ళీ పోయి పేపర్లు తెస్తాడు, మళ్ళీపోయి కూరగాయలు తెస్తాడు, మళ్ళీ పోయి పుస్తకాలు తెస్తాడు, రోజంతా తిరుగుతుంటాడు. ఎక్సర్‌సైజు ఎక్కువైంది.

ఛాన్సు దొరికితే చదువుకొంటాడు, టీ.వి చూస్తాడు. రేడియో వింటాడు, ఏమీ తోచకపోతే వంట చేస్తాడు. వాడి వంటని, వంటమనిషి ఇష్టంగా తింటుంది. 'అంకుల్ మాంసంకూర మీరే చేయండి' అని అడుగుతుంది. వాడు తిన్నంత పెడుతుంది. తాను తినగలిగినంత తింటుంది. మిగిలింది ఇంటికి తీసుకుపోతుంది.

సమయం ఉంటే, ఇల్లు ఊడ్చే, తుడిచే, కడిగే, సర్దే పనులు తనే చేస్తాడు. అమర్చినదానిమీద అత్తగారి చేయిలా కసువు ఊడ్చే ఆమె వచ్చి అటువి ఇటు, ఇటువి అటు నెట్టి వీధిలో దుమ్ము ఇంట్లోకి తెచ్చి, గుడ్డముక్క దుమ్ము అద్దాలకు అద్ది, దులిపిన పక్క దులిపి, కడిగిన పాత్రలు కడిగి 'అంకుల్ మీరు ఇల్లు ఆడపిల్లలకంటే బాగా సర్దిపెట్టుకొంటార'ని సర్టిఫికెట్టు ఇస్తుంది.

టీ.వి పెట్టుకొంటుంది. చూస్తూ కూర్చుంటుంది. పిలిచినా పలకదు. లీనమైపోతుంది. టీ.వి ఉంటే ఆమెకు లోకం తెలియదు. వేరే ఇళ్ళలో పనిచేయవలసిన సమయం వచ్చిందాకా కదలదు. భర్త పోయాడు. నలుగురు పిల్లలు. ఆ కాలనీలో నాలుగిళ్ళలో పనిచేస్తుంది. రోజంతా కరుణ ఇంటిలోనే ఉంటుంది, తింటుంది. స్కూళ్ళనుంచి పిల్లలు వచ్చే సమయానికి ఇంటికి చేరుతుంది.

భర్తకు ఆటో ఇచ్చి, పిల్లల్ని స్కూలుకు పంపి, వంటమనిషి వస్తుంది. వంట చేసే నెపంతో ఇంట్లో ఉంటుంది. ఎప్పుడైనా ఏమైనా వండి పెడుతుంది. ఎప్పుడూ కరుణ వంటే ఆమె తింటుంది. పిల్లల ఫీజులంటుంది, బియ్యం లేవంటుంది, నెలంతా డబ్బు తీసుకుపోతూనే ఉంటుంది. నెల జీతం ఎప్పుడూ తీసుకోదు, అంతకంటే ఎక్కువే నెలంతా తీసుకొంటుంది, సొంత మనిషిదగ్గర ఎప్పుడవసరమైతే అప్పుడు పుచ్చుకొంటున్నట్లు ఉంటుంది. వంట మనిషిలాగా ఉండదు. ఇంటి మనిషిలా వుంటుంది, మందులిస్తుంది. ఏ సమయంలో ఏ మందు వేసుకోవాలో చెబుతుంది, నీళ్ళిస్తుంది, టీ ఇస్తుంది.

కరుణ తలనొప్పి అంటే అమృతాంజనం రాస్తుంది. ఆటో తోలడం ఇష్టం లేనప్పుడు ఆమె భర్త వచ్చి కాళ్ళొత్తి, వళ్ళు మర్దనచేసి పోతుంటాడు. వాళ్ళ సొంత ఇల్లులాగా వస్తుంటారు, పోతుంటారు.

'నీకు నచ్చిన పిల్లను చెప్పరా పెళ్ళి చేస్తాన'ంటే అయోమయంగా చూసి 'పెళ్ళా? చెయ్! పిల్లనా? చూడు! అప్పుడూ నువ్వే చూశావు, ఇప్పుడూ నువ్వే చూడు' అన్నాడు తమ్ముడు. 'చూస్తానంటే తొందరగా చూడు. చేతులు కాల్చుకోలేక చస్తున్నాను' అంటూ నవ్వాడు.

నేను వెళ్ళినరోజు ఉదయం పదిగంటలకు సరళ వచ్చింది. ఆమె భర్త కంప్యూటర్ ఇంజనీర్. తొమ్మిదింటికి పోతాడు. తొమ్మిదింటికి వస్తాడు. ముప్పైఅయిదేళ్ళు. పిల్లల్లేరు. తాతల్లేరు, తండ్రుల్లేరు, అమ్మల్లేరు, అత్తల్లేరు, మామల్లేరు, సరళ సాయంకాలం ఏడు గంటలదాకా వుంది. సరళ రాగానే పూలపొట్లం ఇచ్చాడు. చెండుకట్టి తలలో పెట్టుకొంది. దేవుడికి పూలు తెస్తూ ఇవీ తెచ్చాడు. పూజ చేసింది.

నా తమ్ముడు నాకామెను పరిచయం చేశాడు. కాళ్ళకు నమస్కరించింది. నా మరదలు సుగుణలాగా నమస్కరించింది. కరుణకు స్నానం చేయించింది. బట్టలు మార్పించింది. తలకు నూనెరాసింది, దువ్వింది, పౌడరు పామింది, తుడిచింది, డ్రెస్సింగు టేబిల్ దగ్గర నిలబెట్టింది. శాండల్స్ తుడిచింది, పిల్లలకు చేసినట్లే! పిల్లల్లేరు. వీళ్ళిద్దరికి కూరగాయల మార్కెట్లు దగ్గర పరిచయమైంది. 'అంకుల్ అవి పుచ్చువి, వద్దు. ఇవి మంచివి 'తీసుకోండి' అని వంకాయలు ఏరి ఇచ్చింది.

రోజూ కూరగాయల మార్కెట్టులో కలుసుకొనే వాడు. ఏవో కొనేవాడు. అవసరమై కొంత, ఆమె కోసం కొంత. నడకోసం కొంత మార్కెట్టుకు వెళ్ళేవాడు. ఆమె తన పరిస్థితి చెప్పింది. తమ్ముడు తన స్థితిగతులు వివరించాడు. అట్లా కలిశారు వాళ్ళు, రాకపోకలు పెరిగాయి. సరళ ఇంటికి వస్తుంది. వస్తూ హుషారు తెస్తుంది. తమ్ముడికి

కావలసినన్నీ చేసి పెడుతుంది. వీడు కబుర్లు చెబుతుంటాడు. ఇద్దరూ చూసిన సినిమాని గూర్చి గంటసేపు మాట్లాడుకొంటారు.

'ఇంత ఇంటిలో ఒంటరిగా ఎందుకురా మా ఇళ్ళకు రాకూడదా?' అని నేను పిలిస్తే రావచ్చునన్నాడు కానీ రాలేదు. వచ్చే సూచనలు ఏమీ లేవు. రెట్టిస్తే 'నేను ఒంటరిగా ఎక్కడున్నాను?' అని ప్రశ్నించాడు.

డాక్టర్లందరూ అతనికి హృద్రోగం ఉంది, ఎప్పుడైనా చనిపోవచ్చు, ఆపరేషన్‌కు మళ్ళీ అవకాశం లేదు, నడకే మంచి వైద్యం, టైముకి మందులు వాడటం, ఆందోళన లేకుండా ఉండటం, బి.పి షుగరు పరీక్షలు చేయించడం, డాక్టర్లను తరచుగా సంప్రదించడం వల్ల ఆయుఃప్రమాణం పెరగుతుందనే చెబుతున్నారు.

మేం తాత ముత్తాతల ఆస్తులు పంచుకోలేదు. ఇళ్ళూ, పొలాలూ హైద్రాబాదు రావు. అమ్మితే వచ్చేది మాకక్కరలేదు. పదమంది పనిచేసి బ్రతుకుతున్నారు. ఏటికింత అని తెచ్చి నాకే ఇస్తారు. ఎవరి జీవితాలు, జీతాలు వాళ్ళవి. అందరూ సుఖంగా ఉన్నారు. అన్నదమ్ములందరం జీవితసాయంకాలానికి చేరుకున్నాం.

కరుణ మాకందరికీ ముద్దుల తమ్ముడు. మేమందరం కాడీమేడిలాగా గట్టిగా ఉన్నాం. చిన్నవాడే ఆరోగ్యం విషయంలో ఆందోళన కలిగిస్తున్నాడు. ఇప్పుడీ ఆడవాళ్ళ స్నేహాలతో మా పిల్లలకు – ముఖ్యంగా ఆడ పిల్లలకు – భయాలు కలిగిస్తున్నాడు.

'ఇంట్లో ఖర్చు ఎక్కువగా ఉన్నట్లుంది?' అని నేనంటే 'ఉంది ఏం చేసుకొంటాం?' అన్నాడు. 'పిల్లలున్నారు కదా' అంటే 'వాళ్ళే మనకిస్తారు' అన్నాడు.

'పిల్లలకు ఉంచాలి కదా' అంటే 'వాళ్ళకు అడక్క పోయినా, ఇవ్వవలసింది ఇచ్చేశాను మీ సంపాదనతో నిలవతో, పెన్షన్లతో మీరు సుఖంగా ఉంటే చాలు' అన్నారు. వాళ్ళు. మీ మరదలు పోయాక నాకీ డబ్బు చాలా ఎక్కువగా ఉంది. నా ఖర్చుచాలా తక్కువయిది. సిగరెట్లు ఖర్చు కూడా లేదు. డ్రైవరును మాన్పించినందువల్ల అతడి జీతం, పెట్రోలు ఖర్చూ తప్పింది. మనింట్లో నలుగురు తింటే మనకేం తరిగిపోదు' అన్నాడు.

'నీ డబ్బుకు ఆశపడతారేమో' అంటే 'అడిగితే ఇస్తున్నాను కదా, జీతం మించి అడగరు. మిగతావాళ్ళు నాకే ఏమైనా ఇస్తారు'. 'నీ డబ్బుకు ఆశపడి నిన్నేమయినా చేస్తే?' అనగానే 'నా డబ్బు బ్యాంక్‌లో ఉంటుంది. దగ్గర రెండు మూడు వేలుంటే ఎక్కువ నన్నేమన్నా చేస్తే వాళ్ళకేం దక్కుతుంది. వీళ్ళు బంగారాల్లాంటి మనుషులు. భయం లేదు' అన్నాడు.

'మన కూతుళ్ళకొక భయం, నాకొక భయం' అంటే 'నీకేం భయం' అన్నాడు. 'నీ భద్రత గూర్చి' అన్నాను. 'ఏం భయంవద్దు' అన్నాడు. వాడి బ్యాంక్ బేలన్స్ చాలా

వుంది. ఎఫ్.డి.లు, బాండ్లు, షేర్లు, బంగారం, నగలు లాకర్లో వున్నాయి. కావలసినప్పుడు రెండో మూడువేలు ఏటిఎమ్‌లో తీసుకొంటాడు. డబ్బు చేతిలో ఉండదు. బ్యాంకులో పడుతుంది. బ్యాంకులో వుంటుంది.

సరళ వెళ్ళిపోయే సమయానికి అన్ని పనులు చేసుకొని తీరుబడిగా ఉన్న చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు చేరి కరుణను పట్టించుకోకుండా వాళ్ల కబుర్లు వాళ్లు చెప్పుకొంటున్నారు. టీ.వి. చూస్తున్నారు. ఎఫ్.ఎమ్.వింటున్నారు. కంప్యూటర్‌తో ఆడుకొంటున్నారు.

తాను మాట్లాడే పనిలేనప్పుడు కరుణ చదువుకొంటున్నాడు. అందరూ ఇంట్లో మనుషుల్లాగే ఉన్నారు. అతణ్ణి పట్టించుకోరు. అలా అని గుర్తించకుండా లేరు.

ఇంట్లో ఎవరి పని వాళ్లు చేసుకుంటున్నట్లు వాళ్ళు వస్తున్నారు. పోతున్నారు. ఇదేమన్నా సత్రమా, బస్టాండా, ప్లాటుఫారమా, క్లబ్బా అని నాకనిపించింది. అన్నీ కలిసి పోయినట్లుంది ఇల్లు.

రాత్రి ఎనిమిది గంటలకు ఇద్దరు ఆడపిల్లలు, ప్యాంటూ, షర్టులవాళ్ళు దిగుమతి అయ్యారు. అప్పటికి ఇల్లు కొంచెం ఖాళీ అయింది. కొందరింకా వెళ్ళిపోతూ వున్నారు. పనిమనిషి వంటమనిషి వెళ్ళిపోయారు. సరళ వెళ్ళిపోయింది. 'అంకుల్ ఏం కూరా?' అంటూ వాళ్ళిద్దరూ అరిచారు. అమ్మా ఏం చేశావని తల్లిని, ఏం వండావని వంట మనిషిని అడిగినట్లుంది. మహా ఆనందంగా 'రొయ్యలవేపుడు' అని చెప్పాడు వాడు.

చాలా ఉత్సాహంగా వాళ్ళను నాకు పరిచయం చేశాడు. రమ, ఉమ కంప్యూటర్ ఇంజనీర్లు. నెలకు డెబ్భై ఎనభై వేల సంపాదన. మగరాయుళ్ళు లాగా ఉన్నారు. ముప్పై అయిదుకు పైమాటే వయస్సు. పెళ్ళికాలేదు. రమది పల్లె, ఉద్యోగానికి సిటీకి వచ్చింది, ఒంటరి.

ఉమ తల్లిదండ్రులు సిటీలోనే ఉన్నారు. కానీ ఆమె అక్కడికి పోదు, అంకుల్‌తో పాటే వుంటుంది.

పది నిమిషాల్లో రెడీ అయి వచ్చారు. బెడ్‌రూంలోకి వెళ్ళేటప్పుడు వాళ్ళు మగరాయుళ్ళు, డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చేసరికి అందమైన ఆడకూతుళ్ళు, టేబుల్ సర్దారు, కుర్చీలు సరిచేశారు. వంటగది సామానులోంచి టేబిల్‌మీదికి భోజన పదార్థాలు రెడీ చేశారు. మాకు వడ్డించారు. వాళ్లు వడ్డించుకొన్నారు. కబుర్లు చెబుతూ తింటున్నారు. వస పిల్లలు. నా తమ్ముడేం తక్కువ? వస పిల్లల ట్రైనింగ్ మాస్టరు.

'నువ్వు రొయ్యలు వేపుడు తింటున్నావా, నెయ్యి కూడా వేసుకొంటున్నావా?' అంటే 'ఎప్పుడన్నా!' అన్నాడు. 'ఏంగాదు తిననివ్వండి అంకుల్' అన్నారు వాళ్ళు. వాళ్ళు

నాకు బంధువుల కారు. నన్నింతవరకు ఎరగరు. 'అంకుల్' అని అనాయాసంగా అనేశారు.

చేతులు కడుక్కోగానే ప్లేట్లు తీశారు. సింకులో వేశారు. కరుణ చేతులు తుడిచారు. మూతి తుడిచారు. టీ.వి. దగ్గర సోపు గింజలు పెట్టారు. కొత్తనవల తెచ్చారు. టీ.వి. వింటూ నవల చదువుతూ కూర్చున్నాడు. సోపు నములుతున్నాడు.

కరుణ బెడ్‌రూంలో బెడ్‌షీటు మార్చారు. బ్లాంకెట్ మార్చారు. ఆల్‌ఔట్ స్విచ్ వేశారు. కిటికీలు తీసి కర్టెన్లుసరిగా లాగారు. డిమ్‌లైటు వేశారు. దిండ్ల కవర్లు మార్చారు. ఎ.సి. వేశారు. ఫ్యాన్ రెండులో ఉంచారు.

'మీ గది రెడీ' అన్నారు. కొంచెం సేపు టీ.వి. చూస్తానంటే 'మీ ఇష్టం' అన్నారు. బెడ్ రీడింగు లైటు వేశారు. వాళ్ళది డబుల్ బెడ్. 'పడుకొంటాం' అన్నారు. 'మీ ఇష్టం' అన్నాడు. 'అవసరమైతే లేపండి' అన్నారు. 'సరే' అన్నాడు. మాకు గుడ్‌నైట్ చెప్పి వాళ్ళ తలుపు వేసుకోకుండా పడుకొని లైటు తీసేశారు.

వాళ్ళు మా వాళ్ళు అవునో కాదో తెలియదు. తెలిసిన బంధువుల, మిత్రుల పిల్లలూ కారు. 'ఎవరు వీళ్ళు?' అంటే 'మనవాళ్ళే!' అన్నాడు. నేనింకేం మాట్లాడేది! కరుణవెళ్ళి పడుకొని వాళ్ళు తెచ్చిన నవల చదువుకొంటున్నాడు. నేను నిద్రకు రెడీ. మేం తలుపు వేసుకోలేదు. మెయిన్ డోర్ వాళ్ళే లాక్ చేశారు.

'మరదలు బెడ్‌రూం వాళ్లకు ఇచ్చావా?'

'ఊఁ!' అన్నాడు.

'కాట్ కూడానా?'

'ఊఁ!'

'బెడ్ కూడానా?'

'బెడ్ మార్చాను'

'నీ భార్య రూం?'

'మరదలు రూం! పిల్లల తల్లి రూం! ఇప్పుడు వీళ్ళ రూం! ఏం?' అన్నాడు.

సెంటిమెంటు వాడికేమీ ఉన్నట్లు లేదు. ఆ రూంలో మనుషులు, భార్యలేకున్నా తిరగాలని సెంటిమెంటా? భార్యకు వాళ్ళు ప్రత్యామ్నాయమా? వాళ్ళను ఉంచుకొన్నాడా? పెంచుకొంటున్నాడా?

'మగపిల్లల్ని పెంచుకోకూడదూ? మనవళ్ళని తెచ్చి ఉంచుకోకూడదూ?' అన్నాను. 'ఆడపిల్లలు ప్రేమగా చూసుకొంటున్నారు. మనమరాళ్ళు, మనమళ్ళ చదువులు, అభివృద్ధి

తల్లిదండ్రుల దగ్గరే జరగాలి. తాతలు వాళ్ళను గారాంతో పాడు చేస్తారు. వాళ్ళు వద్దు'.

ఎప్పుడో నిద్రపోయాను. పక్కనే తమ్ముడు గాఢ నిద్రలో వున్నాడు. తెల్లారి లేచి చూసేసరికి, ముద్దుగా ఉన్నాడు వాడు. రెండుకాళ్ళ మధ్య చేతులిరికించుకొని చిన్నతనంలో లాగే నిద్రపోతున్నాడు తమ్ముడు. బుజ్జి తమ్ముడు. వీడు పెద్ద మగవాడై పోయాడు.

ఆదివారం అన్ని పత్రికలు ముందేసుకొని మేట్రిమోనియల్, పెళ్ళిళ్ళ సంబంధాల ప్రకటనలు చదువుతాడు. భర్త కావాలికి. భార్య కావాలి జత చేస్తుంటాడు, ప్రకటనలు ఇచ్చినవాళ్ళకు ఫోన్లు చేస్తాడు.

ఆడపిల్లకు పనికివచ్చే మగపిల్లల ప్రకటనలు వాళ్ళకు సూచిస్తాడు. అలాగే మగపిల్లలకు తగిన ఆడపిల్లల ప్రకటనలు వాళ్ళకు తెలుపుతాడు. ఈ వారం ప్రకటనలకు ముందు వారాల ప్రకటనలు జతచేస్తాడు.

ఈ యువతికి ఈ యువకుడు తగినవాడు అని చెబుతాడు. 'ఫోను బిల్లులు పెరిగిపోవా, అంటే ఎలాగో ఖర్చు కావాలి కదా, ఈ డబ్బు' అని నవ్వుతాడు. పదేళ్ళ నుంచి ఇదే పని. చాలా మేచ్‌లు కుదిర్చాడు. తమ్ముడు మేరేజి బ్యూరో ఏమీ నడపటం లేదు. ఎందరి కృతజ్ఞతలో అందుకొని ఆనందించాడు కరుణ.

ఈ మధ్య వయస్సులు పెద్దవైన వధువుల ప్రకటనలు మాత్రమే చూసి, వరుల్ని అన్వేషించసాగాడు. మగపిల్లలు ఎక్కువైపోతూ, ఆడపిల్లలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో కూడా ఆడపిల్లలకు పెళ్ళిళ్లు ఎందుకు కావడంలేదు? ఉద్యోగం చేస్తూ నగరాల్లో ఉండిపోయిన ఆడపిల్లలకు సరైన జంటలు లేకపోవడం వల్ల, తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం వల్ల, ఆడపిల్లల జీతం మీద కుటుంబాలు ఆధారపడడం వల్ల, అందం లేకపోవడం వల్ల, ప్రేమించే టైం లేకపోవడం వల్ల, టైం దాటిపోవటం వల్ల అని కొన్ని కారణాలు చెప్పుకొని చివరకు కట్నకానుకలు ఇవ్వలేకపోవడం అని తేల్చుకొన్నాడు.

ఉద్యోగాలు చేస్తూ వేలకు వేలు సంపాదిస్తున్న అమ్మాయిలకు వయస్సు ముదిరి పెళ్ళికాని వాళ్ళ జాబితాలు, నగరంలోవి, ఇంటర్‌నెట్ నుంచి కూడా తీసుకొన్నాడు. ప్రింటౌట్లు, పేపరు కటింగ్‌లు, నోటుబుక్కులు, ఫోను నెంబర్లు రాసుకొని తెలియనివాళ్ళకు, తెలియని భర్తల్ని వెదికే ప్రయత్నంలో తలమునకలైన తమ్ముడు అవివాహిత సేవలో ఉన్నాడని అర్థమైంది నాకు.

అవివాహిత యువకులకోసం కొత్త చెప్పులు కొనుక్కొని ఆఫీసులు చుట్టూ, కంపెనీలు, డిపార్టుమెంట్లు చుట్టూ కాలికి బలపం కట్టుకొని తిరగసాగాడు.

ఈ సందర్భంలో పెళ్ళికాని అమ్మాయిల ఫోటోలు సంపాదించి దేశంమీద తిరుగుతున్నాడు. అవివాహితులు అతణ్ణి నమ్ముతున్నారు.

పల్లెటూరి రమ పట్టణంలో ఒంటరిగా ఉండలేక, సొంతవాళ్ళు లేక, కరుణ ఇల్లు చేరింది. రోజంతా ఆఫీసు, రాత్రంతా ఇల్లు, తనకో గూడు, రక్షణ, పత్రికల్లో ప్రకటనలిచ్చి విసిగిపోయింది.

నగరంలోని ఉమ తల్లిదండ్రులు వృద్ధులు. ఊళ్ళో ఎప్పుడూ ఉండరు. మద్రాసు, బొంబాయి, కలకత్తా కొడుకుల దగ్గరకు పోయి మూణ్ణాలుగు  నెల్లుండి వస్తుంటారు. ఆడపిల్ల  పెళ్ళి చేయలేకపోయారు.

సొంత ఇంటిలో రక్షణలేదు. ఎవరో వస్తారు. స్వర్గానికి  తీసుకుపోతారని ఎదురుచూస్తూ  వుంది. ఆ ప్రయత్నంలో  కరుణ పంచన చేరింది ఉమ.

ఫోన్లు చేసి, పోయి చూసి వచ్చి, చూడ్డానికి రమ్మంటే, ఒక యువకుడు  తగిన వయస్సు, ఉద్యోగం ఉన్నవాడు చూడటానికి వస్తున్నాడంటే, నాకూ ఉత్సాహంగా అన్పించింది. ఆదివారం పేపర్లు పక్కనపెట్టి హాల్‌ని ఆడపిల్లలిద్దరూ అందంగా మార్చారు.

ఉమకు సంబంధం. ఆమెను రమ తోడబుట్టిన దానిలా అలంకరించింది. కారు ఆగితే ఇద్దరూ తొంగి చూసి గదిలో దూరారు. యువకుడూ, తల్లీ, తండ్రీ వచ్చారు. కరుణ, ఉమ ఉద్యోగం, జీతం, ఇంటి పరిస్థితులు ఇతర వివరాలు వాళ్ళకు చెప్పాడు.

పెళ్ళిచూపులకు రమ ఉమను తీసుకొచ్చి కూర్చోబెట్టింది. కాఫీలు ఇచ్చింది. మాటలు కలిపింది. వంట మనిషి, పనిమనిషి హడావుడి చేస్తున్నారు. ఆదివారం భర్త సేవ ఇంట్లో ఉంటాడు. కాబట్టి రాలేదు సరళ. 'చుట్టుపక్కల అమ్మలక్కలు చేరారు.

యువకుడి వివరాలన్నీ ఉమకు ముందే తెలుసు. పెళ్ళిచూపులైపోయి, వాళ్ళు ముగ్గురూ డ్రైవరుతో సహా తలకాయలు తాటికాయల్లా ఊపగా యువకుడు, ఉమతో పెళ్ళి నాకిష్టమే అన్నాడు. అమ్మాయిల గుండెల్లో  ఆనంద సముద్రాలు పొంగివుంటాయి. కళ్ళల్లో నీళ్ళొచ్చాయి. సొంత తల్లిదండ్రుల మాట యువకుడి తల్లిదండ్రులు ప్రస్తావిస్తే 'నేను మేజర్ని' అంది ఉమ.

పెళ్ళి తేదీ, స్థలమూ, ఏర్పాట్లు మాట్లాడుకొని కార్డులు ముద్రించుకొనే పనుల్లో పడటానికి సిద్ధమయ్యారు ఇరువైపులవాళ్ళు.

'మరి రమ సంగతి?' అని అడిగితే 'వచ్చే ఆదివారం ఆమె పెళ్ళిచూపులు' అని చెప్పాడు కరుణ.

'వీళ్ళిద్దరూ పెళ్లయి, నీ  ఐదుగురు కూతుళ్ళు లాగా  వెళ్ళిపోతే ఎలా?' అంటే 'ఇంట్లోకి రావడానికి ఇంకా చాలా మంది యువతులు సిద్ధంగా ఉన్నారు' అన్నాడు.

మాకింత ఆస్తి ఉన్నా ఎవరికీ కరుణ కట్నాలు ఇవ్వలేదు. అయిదుగురి పెళ్ళి ఘనంగా చేశాడు.

కూతుళ్లను కాపురాలకు పంపి అందరికీ తన సంపాదన సమంగా పంచి ఇచ్చాడు.

మేం పేరుకు మాత్రమే వచ్చేవాళ్ళం. అన్ని సంబంధాలు వాడే చూసేవాడు. అన్ని సంగతులు వాడే మాట్లాడేవాడు. అన్ని ఏర్పాట్లూ చేసేవాడు. ఆడపిల్లల పెళ్ళిళ్లు చేయడంలో ఆరితేరిపోయాడు. మా కుటుంబాలలో మరి ఆడపిల్లలే లేరు. ఉంటే వాళ్లకీ మంచి సంబంధాలు తెచ్చేవాడే! ఆ సులువు తెలిసినందువల్ల ఊరికే ఉండలేకుండా ఉన్నాడు.

ఇంతకుముందు ఇటువంటి పెళ్ళిళ్లు నాలుగు చేశాడు. ఇది అయిదోది. వచ్చేవారం ఆరోది నిశ్చయమవుతుంది. నాకు చాలా ఆనందంగా వుంది. ఇల్లు కళకళలాడుతూ వుంది. పెళ్ళి కుదిరింది కదా. పిల్లలది పేరంటాళ్ళది పెద్ద హడావుడిగా ఉంది.

వాళ్ళిద్దరూ మా ఇద్దరి కాళ్లకు మొక్కుతుంటే నాకు ఏడుపు వచ్చింది. చిన్ని నా తమ్ముణ్ణి ముద్దు పెట్టుకొన్నాను. వాడు కన్నీళ్ళు తుడుచుకొన్నాడు. అవి ఆనందబాష్పాలా! తమ్ముడు చేస్తున్నది స్వామికార్యమా? స్వకార్యమా? అంతుపట్టలేదు. అవివాహితుల సేవా? ఆత్మసేవా? నిర్ణయం కాలేదు.

హాల్లో టీ.వి. తిక్కరేగినట్లు వాగుతూ ఉంది. ఉమ, రమల బెడ్‌రూంలో ఎఫ్.ఎమ్. పిచ్చిగా మోగుతూ ఉంది. అంత గోలా ఆనందంగా వుంది. చిన్నతనంలో తన నీడన నడిచిన బుజ్జి తమ్ముడు ఎంత ఉన్నతుడుగానో కనిపించాడు. వాణ్ణి చంకకింద దూర్చుకొని పొలాలల్లో పడి పరిగెత్తాలనిపిస్తూ వుంది.

వంట సిద్ధం చేస్తున్నారు. అమ్మలక్కలు ఒక్కొక్కరు వెళ్ళిపోతున్నారు. ఉమ, రమ, వంటమనిషి పనిమనిషి వాళ్ళ పిల్లలతో ఇల్లంతా కళకళలాడుతూ ఉంది.

కరుణాకరరెడ్డి ఇంతకాలం పెళ్ళిళ్ళు చేసే అలవాటైన పనే ఇప్పుడూ చేస్తున్నాడు. నిరంతరం ఉండే వ్యాపకం పెట్టుకొన్నాడు. పుణ్యకార్యం కొనసాగిస్తున్నాడు. ఆలోచించడం, శ్రమించడం, మంచి పనులే. తలకూ, తనువుకూ తుప్పుపట్టకుండా చూసుకొంటున్నాడు. ఆరోగ్యం పెంచుకొంటున్నాడు. బిజీ అయిపోయాడు. యువకుడు అయిపోతున్నాడు.

తమ్ముడు వయస్సును జయించాడు. వృద్ధాప్యాన్ని జయించాడు. ఒంటరితనాన్ని జయించాడు. నా తమ్ముడు విజయుడు, నాలుక్కాలాలు బ్రతుకుతాడు. హృద్రోగం వీణ్ణి ఏమీ చేయదు.

నా కళ్ళు చెమ్మగిల్లాయి. బుజ్జి నా తమ్ముడు తన చిన్నారి చేతులతో నా చెంపలు తుడిచాడు.

రత్న ఫోను చేసింది. అందుకొన్నాను.

'పెదనాన్నా! నాన్నను చూశావా?'

'చూశాను. నిన్నటినుంచి ఇక్కడే ఉన్నాను.'

ఎవరూ వినకుండా మాట్టాడాలని పైకి వెళ్ళాడు.

'ఎలా ఉన్నాడు?'

'చక్కగా ఉన్నాడు. ఆరోగ్యం బాగుంది. ఆనందంగా వున్నాడు. నాకెంతో సంతోషంగా ఉంది'.

'ఇంటినిండా ఆడవాళ్ళు?'

'ఉన్నారు. వాళ్ళు మీ అమ్మకు సవతులు కారు. మీకు చెల్లెళ్ళు! మాకు కూతుళ్ళు!'